కూటమి పాలనలో రైతుకు దగా

- ఏడాదిలో అందని సాయం
- భరోసా కరువు

చింతలపూడి : కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలుకాలేదు. ఆరుగాలం కష్టపడి రైతన్నలు పండిస్తున్న పంటలకు సరైన గిట్టుబాటు ధర లభించడం లేదు. రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. వైఎస్సార్ సీపీ హయాంలో నాటి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారు. రూ.కోట్లు వెచ్చించి రైతు భరోసా కేంద్రాలను నిర్మించారు. విత్తనం నుంచి పంట కొనుగోలు చేసే వరకు మొత్తం రైతు భరోసా కేంద్రాల ద్వారా నిర్వహించారు. రైతు భరోసా పథకంలో ఏడాదికి రూ.15 వేలు చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. రూ.17.22 కోట్ల వ్యయంతో చింతలపూడి నియోజకవర్గంలో 89 రైతు భరోసా కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రైతు భరోసా పథకం ద్వారా 45,313 మంది రైతులకు రూ.201.31 కోట్లు పెట్టుబడి సాయం అందించారు. 60,586 మంది రైతులకు వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రూ.32.23 కోట్లు అందజేశారు. రైతులు పండించిన పంటలను దళారీ వ్యవస్థ లేకుండా అధికారులతో ధాన్యం కొనుగోలు చేయించి వారికి అందాల్సిన సొమ్మును నేరుగా రైతులు ఖాతాల్లో జమ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. అన్నదాత సుఖీభవ ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసి అమలు చేయలేదు.

అన్నదాతకు అవస్థలు

బుట్టాయగూడెం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు పెట్టుబడి సహాయం అందించలేదు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల పంపిణీ కూడా ప్రశ్నార్థకంగా మారింది. ఏడాది కాలంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నామమాత్రంగానే విత్తన సరఫరా చేశారంటూ విమర్శిస్తున్నారు. ఎరువుల కోసం ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. పండించిన ధాన్యం కూడా అమ్ముకునేందుకు అనేక అవస్థలు పడే పరిస్థితి ఏర్పడింది. ఆర్‌బీకేలను నిర్వీర్యం చేశారు. రైతులకు సలహాల కోసం ఏర్పాటు చేసిన కియోస్కోల యంత్రాలు మూలన పడ్డాయి. ప్రస్తుత పాలన చూసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనను రైతులు గుర్తు చేసుకుంటున్నారు.


చింతలపూడి : రైతు భరోసా కేంద్రం


వైఎస్సార్ సీపీ హయాంలో ఎరువులు పంపిణీ చేస్తున్న తెల్లం బాలరాజు (ఫైల్)

వైఎస్సార్ సీపీ హయాంలోనే మేలు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు మెరుగైన సేవలు అందించాయి. ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం పెట్టుబడి సాయం, ఎరువులు, విత్తనాలు ఈ కేంద్రాల ద్వారానే అందించారు. ఆర్‌బీకేల్లో కొనుగోలు చేయడం వల్ల రైతులకు దళారుల బెడద తప్పింది. గిరిజన ప్రాంతంలో 90 శాతం సబ్సిడీపై గిరిజనులకు విత్తనాలను, ఎరువులను అందజేసేవారు. వ్యవసాయ పనిముట్లతో పాటు ట్రాక్టర్‌లు కూడా అందించారు. ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు రైతులకు ఎంతో ఉపయోగపడేవి. రైతులకు కావాల్సిన అన్ని రకాల సబ్సిడీ ఎరువులు, విత్తనాలు రైతులకు 48 గంటల్లోనే నేరుగా అందేవి. ప్రతి రైతు తాను సాగు చేస్తున్న పంటలకు సంబంధించి ఇ-క్రాప్ బుక్కింగ్ చేసేవారు. తద్వారా విపత్తులు, తుఫానుల ద్వారా పంట నష్టం వాటిల్లితే ప్రభుత్వం నుంచి వచ్చే నష్టపరిహారం పొందే అవకాశం ఉండేది. రైతులకు పంట రుణాలను కూడా అందించారు. పోలవరం నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో ఉన్న 107 ఆర్‌బీకేల ద్వారా 41,584 మంది రైతులు లబ్ధి పొందారు. వీరి బ్యాంకు ఖాతాల్లో రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం ద్వారా సుమారు రూ.32.03 కోట్లు జమ చేశారు. 99 మంది రైతులకు రూ.134 లక్షలతో యంత్రాలు పనిముట్లను అందజేశారు.


బుట్టాయగూడెం : ముప్పినవారిగూడెంలో మూలనపడ్డ కియోస్క్ యంత్రం

పెట్టుబడి సాయం ఏదీ



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఏడాదికి రూ.20 వేలు చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామన్న హామీ నెరవేరలేదు. పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందించలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో పెట్టుబడి సాయం అందించాలి.

– గడ్డమడుగుల రాజేష్ నాయుడు, రైతు, చింతలపూడి

ఆర్‌బీకే సేవలు అద్భుతం



వైఎస్సార్ సీపీ హయాంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల్లో సేవలు ఎంతో అద్భుతంగా ఉండేవి. ఎరువులు, విత్తనాలు కోసం దళారులను ఆశ్రయించాల్సిన అవసరం ఉండేది కాదు. రైతులకు ఎంతో మేలు జరిగేది. కియోస్కో యంత్రాల ద్వారా అనేక ప్రయోజనం ఉండేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాటిని మూలన పెట్టింది. పెట్టుబడి సాయం కూడా అందించే పరిస్థితి లేదు. ప్రస్తుతం రైతుల పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది.

– తెల్లం భీమరాజు, రైతు– దుద్దుకూరు, బుట్టాయగూడెం మండలం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

చింతలపూడి : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జ్ సీహెచ్ మధుబాబు అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చింతలపూడి కోర్టు ఆవరణలో గురువారం ఆయన మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణం కలుషితం కాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. చింతలపూడి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మాణిక్యాలరావు, కోర్టు సూపరింటెండెంట్ పీజీ నాయుడు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పీఎల్‌వీ అక్బర అలీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటండి

ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రిద్దాం, కాలుష్యాన్ని అరికడదామని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పిలుపు నిచ్చారు. చింతలపూడి జూనియర్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఆయన వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. నగర పంచాయతీ కమిషనర్ ఎ.రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమంలా మొక్కలు నాటే కార్యక్రమం

జంగారెడ్డిగూడెం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మితో కలిసి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని ఒక ఉద్యమంగా చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కె.వి రమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

- జంగారెడ్డిగూడెం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసు ప్రాంగణంలో మొక్కలు నాటారు. ములగలంపల్లి బీటులో మారుజాతి కలప ఇచ్చే 20 హెచ్ఏ ప్లాంటేషన్ పనులు చేపట్టారు. జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో వనమహోత్సవాలు నిర్వహించారు.
- గురవాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, ఏలూరు ఎనలిస్ట్ సీహెచ్ తేజస్విని ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. భక్తులకు మొక్కల పంపిణీ చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఆర్‌వీ చందన తెలిపారు.
- పారిజాత గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో కార్య నిర్వహణ అధికారి మాణిక్యాల రాంబాబు ఆధ్వర్యంలో మామిడి, మహాగని, ఉసిరి, నేరేడు, వేప, సపోటా, నారింజ, గానుగ, పనస, కొబ్బరి తదితర మొక్కలు నాటారు.
- మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం కోర్టు ప్రాంగణంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) సీహెచ్ కిషోర్ కుమార్ మొక్కలను నాటారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, ఇంటి వద్ద మొక్కలు నాటాలని ఆయన సూచించారు. బార్ ప్రెసిడెంట్ జీఎస్ఆర్ మూర్తి, న్యాయవాదులు, పోలీస్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


చింతలపూడి :కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న జడ్జి మధుబాబు


జంగారెడ్డిగూడెం: మొక్క నాటుతున్న ప్రజాప్రతినిధులు

అటవీశాఖ ఆధ్వర్యంలో..

కుక్కునూరు: స్థానిక హైస్కూల్లో వివిధ రకాల మొక్కలు నాటారు. తహసీల్దార్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో కివ్వాక, మర్రిపాడు గ్రామాల్లోని ఆర్‌అండ్ ఆర్ కాలనీల్లో మొక్కలు నాటారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీవారి కొండపై మొక్కలు నాటిన అధికారులు

ద్వారకాతిరుమల: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శ్రీవారి కొండపై గురువారం చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త నివృతరావు, ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి, ఈఈ డీవీ భాస్కర్, ఎలక్ట్రికల్ డీఈ టి.సూర్యనారాయణ, ఏఈఓ వాసు తదితరులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు.


ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపై మొక్క నాటుతున్న దేవస్థానం చైర్మన్ సుధాకరరావు

ఎక్సైజ్ దాడులు

కుక్కునూరు: మండలంలోని మారేడుబాక గ్రామంలో గురువారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. గ్రామానికి చెందిన గుగులోత్ రాంబాబు వద్ద 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

నేడు మండల పరిషత్ సమావేశం

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండల పరిషత్ సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.జ్యోతి తెలిపారు. వివిధ శాఖల ద్వారా చేపట్టిన పనుల నివేదికలపై సమీక్షిస్తామని, అధికారులు, ప్రజా ప్రతినిధులంతా పాల్గొనాలని ఆమె కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతలపూడి : చింతలపూడి సబ్ స్టేషన్ పరిధిలోని సీతానగరం, పట్టాయిగూడెం ఫీడర్ల లైన్ నిర్వహణ నిమిత్తం సీతానగరం ఫీడర్‌పై ఉన్న సీతానగరం సబ్ స్టేషన్, చింతలపూడి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న నాగిరెడ్డిగూడెం, ఇండస్ట్రియల్ ఫీడర్, రేచర్ల టౌన్, రేచర్ల ఏజీఎల్ ఫీడర్లు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఆయా సబ్ స్టేషన్లు, ఫీడర్ల పరిధిలో ఉన్న ప్రజలంతా సహకరించాలని కోరారు.

పంటల మద్దతు ధర కల్పనలో విఫలం

కుక్కునూరు: రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఏఐయూకేఎస్ జాతీయ కమిటీ కన్వీనర్ కెచ్చల రంగారెడ్డి విమర్శించారు. గురువారం అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం గడ్డల ముత్యాలరావు అధ్యక్షతన కుక్కునూరు ప్రజాపంథా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ 2025–26 పంట కాలానికి ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ 14 రకాల పంటలకు ధరలు నిర్ణయిస్తూ అనేక రాష్ట్రాల సిఫార్సులను పక్కన పెట్టి తన కార్పొరేట్లకు అనుకూలంగా ఎంఎస్‌పీ నిర్ణయించిందని ఆరోపించారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు వరి క్వింటాకు సాధారణ రకం రూ.3 వేలు, ఏ గ్రేడ్ రకానికి రూ.3,200, ప్రత్తికి రూ.8,521, మొక్కజొన్నకు రూ.2,900, వేరుశెనగకు రూ.8 వేలు, కందులకు రూ.9,200, పెసర్లకు రూ.9 వేలు, హైబ్రిడ్ జొన్నలకు రూ.4 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలవరం ముంపు పేరుతో విలీన మండలాల్లో మూసివేసిన వెబ్‌ల్యాండ్‌ను పునరుద్ధరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐయూకేఎస్ రాష్ట్ర నాయకులు సిరికొండ రామారావు, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడికి కృషి

బుట్టాయగూడెం: వ్యవసాయ సాగులో రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధనకు కృషి చేస్తున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. మండలంలోని కాపవరం, పందుగూడెం, బండార్లగూడెం గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం (వెంకటరామన్నగూడెం) ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో బాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ పథకాలు రైతులకు మరింత చేరువ అవ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 2025 సీజన్‌లోని ముందస్తు వ్యవసాయ సలహాలు, సూచనలు, పంటల యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. బండార్లగూడెంలో కేవీకే ద్వారా ఇటీవల 11 మంది లబ్ధిదారులకు ఇచ్చిన బ్లాక్ బెంగాలీ రకం మేకలు ఒక కాన్పుకు 4 పిల్లలకు జన్మనిచ్చాయని శాస్త్రవేత్త డాక్టర్ ఎ.దేవీ వరప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ మేకలను బాషా పరిశీలించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ మేరీ రాణి, జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు లలిత సుధ, కేఆర్‌పురం సహాయ వ్యవసాయ సంచాలకులు పీజీ బుచ్చిబాబు, ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ ఈ.రేఖ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త, మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు, పశువర్ధకశాఖ డాక్టర్ విజయ్‌కుమార్, స్థానిక వ్యవసాయ సహాయకులు ఎస్ భవాని, కె.వజ్రాల రాజు, టి.కిరణ్ కుమార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


బండార్లగూడెంలో కేవీకే ద్వారా పంపిణీ చేసిన బ్లాక్ బెంగాలీ మేకలను పరిశీలిస్తున్న అధికారులు

పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

బుట్టాయగూడెం: గిరిజన యువత పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక హైస్కూల్లో గురువారం ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం ఉద్యోగ మేళా నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల సీఎం చంద్రబాబు పోలవరంలో పర్యటించిన సమయంలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో పాటు గిరిజన యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదేశించారని చెప్పారు. ఈ మేరకు 12 మంచి పేరున్న కంపెనీలను తీసుకొచ్చి వెయ్యి మందికి ఉద్యోగ అవకాశం కల్పించేలా కృషి చేశామని తెలిపారు. ఉద్యోగం వద్దంటే ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలు ఏర్పాటుకు యువత ముందుకు రావాలని, అందుకు అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు. ఇప్పటికే సర్వే నిర్వహించామని, సుమారు రెండు వేల మందికి ఉద్యోగాలు, ఉన్నత విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. దరఖాస్తు చేసుకుంటే ఉన్నత విద్యను ప్రోత్సహిస్తామన్నారు. జాబ్ మేళాలు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నిర్వహిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలో రహదారుల పనులకు సుమారు రూ.57 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. తొలుత అంతర్జాతీయ పర్యావరణం దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎంవీ రమణ, ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్, జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ అధికారి ఎన్ జితేంద్ర బాబు, జిల్లా ప్లేస్మెంట్ అధికారి కె.ప్రవీణ్, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.



బుట్టాయగూడెంలో మొక్కలు నాటుతున్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బాలరాజు

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది సేవా దృక్పథంతో రోగులకు సేవలు అందించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆసుపత్రిలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు ఇప్పటికే ఆసుపత్రి వర్గాలు ప్రతిపాదనలు పంపారని, త్వరలో ఆ ఏర్పాటుకు కృషిచేస్తామని చెప్పారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరతను లేకుండా చేస్తామన్నారు. సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ బేబి కమల, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు న్యాయం చేయాలి

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలోని ఆటోలకు డిజిటల్ ట్రాఫిక్ నెంబర్లు తయారీకి ఏజెన్సీలను టెండర్ విధానంలో నియమించాలని ఏలూరు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్ష, కార్యదర్శులు చక్రాల అమర్‌కుమార్, జి.గోపి కోరారు. ఈ మేరకు గురువారం ఉదయం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. ఏలూరు నగరంలో సుమారు ఐదు వేల మంది ఆటో కార్మికులు ఉన్నారని, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతున్నారని పేర్కొన్నారు. డిజిటల్ ట్రాఫిక్ నెంబర్లు తయారు చేసే ఏజెన్సీలను నియమించటంలో నామినేటెడ్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తక్కువ ధరకే డిజిటల్ నెంబర్లను తయారు చేసే ఏజెన్సీలకు ఈ బాధ్యతలను అప్పగించాలని కోరారు. రూ.200కే డిజిటల్ ట్రాఫిక్ నెంబర్లు తయారు చేసే సంస్థలు ఉన్నాయని, రూ.250 చెల్లించటం ద్వారా ఆటో కార్మికులు నష్టపోతారని వివరించారు.

క్లుప్తంగా

దత్తాత్రేయ స్వామికి పంచామృత అభిషేకాలు



జంగారెడ్డిగూడెం: మండలంలోని గురవాయిగూడెం శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి ఉపాలయమైన శ్రీ దత్తాత్రేయ స్వామికి గురువారం సందర్భంగా పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ


దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న తెల్లం రాజ్యలక్ష్మి

కొయ్యలగూడెం: సీతంపేట శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8.18 గంటలకు పునర్నిర్మించిన ఆలయం ఎదుట ఏకశిలా ధ్వజస్తంభాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. గణపతి, ఉమా సహిత రామలింగేశ్వర, నందీశ్వర, చండీశ్వర, నవగ్రహ దేవతామూర్తులతో పాటు వివిధ దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గం ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆరువేల మందికి పైగా భక్తులకు అన్నసమారాధన చేర్పాటుచేశారు. గ్రామస్తులంతా ఐక్యంతో ఉత్సవాలలో పాల్గొనడం స్ఫూర్తిదాయకం అని రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. సుమారు 80 ఏళ్ల నాటి శివాలయాన్ని గ్రామస్తుల సౌజన్యంతో పునఃనిర్మించారని, సర్పంచ్ తోటకూర పద్మావతి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తోట జయబాబు, మధ్యాహ్నపు యేసు తెలిపారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా ముగిశాయి.

జీలుగుమిల్లిలో భూముల పరిశీలన


జీలుగుమిల్లిలో భూములను పరిశీలిస్తున్న అధికారులు

బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురవుతున్న అల్లూరి జిల్లా చింతూరు డివిజన్‌లోని కొండ్రాజుపేట గ్రామ నిర్వాసితులకు కోసం జీలుగుమిల్లిలో పునరావాస గృహనిర్మాణాలు, భూమికి భూమిగా ఇచ్చేందుకు అవసరమైన భూములను గురువారం చింతూరు ఐటీడీఏ పీఓ అపూర్వ భరత్, స్పెషల్ కలెక్టర్ సరళ వందనం, ఎస్‌డీసీ బలరామకృష్ణ, కూనవరం తహసీల్దార్ వెంకటేశ్వర్లు, నిర్వాసితులు పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ అపూర్వ భరత్ మాట్లాడుతూ 160 ఎకరాలు భూమి అవసరం కాగా, ఇందులో 22 ఎకరాలు భూమికి భూమిగా అవసరమని, మిగిలిన 138 ఎకరాలు పునరావాస కాలనీ కోసం అవసరమవుతుందని చెప్పారు. నిర్వాసితులు అంగీకారంతోనే భూములు సేకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జీలుగుమిల్లి తహసీల్దార్ ఉదయ్, వీఆర్‌ఓ తులసి, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శాంతి కల్యాణం


ఆలయంలో పూజ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక అశ్వరావుపేట రోడ్డు సత్యనారాయణపురంలోని పునర్నిర్మించిన శ్రీ సుందర బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం కర్రి రామ రెడ్డి సుగుణ దంపతులు చేతుల మీదుగా సంప్రోక్షణ, శాంతి కల్యాణం, హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1500 మందికి అన్న సమారాధన ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో జజ్జూరి శ్రీనివాసరెడ్డి,శ్రీ వల్లి దేవసేన సమేత సుందర్ బాలసుబ్రమణ్యేశ్వర స్వామి అన్న ప్రసాద వితరణ కమిటీ పాల్గొన్నారు

గవరవరం విద్యార్థినికి పురస్కారం



కొయ్యలగూడెం: భారతరత్న దివంగత ఏపీజే అబ్దుల్ కలాం పురస్కారానికి గవరవరం గ్రామానికి చెందిన విద్యార్థిని ఎంపికయినట్టు జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పి శేఖర్ బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గవరవరం గ్రామంలోని వెంకటపతి రాజు ఎడ్యుకేషనల్ విద్యా సంస్థలలో ఒకేషనల్ జూనియర్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం వెటర్నరీ చదివిన పెనిమెల్లి శ్యామలను పురస్కారానికి ఎంపిక చేశామని తెలిపారు. మాజీ సర్పంచ్ నరసింహా రాజు, విద్యాసంస్థల చైర్మన్ ఎస్ఆర్ఆర్ సుభద్ర దేవి, కళాశాల ప్రిన్సిపాల్ నారా కేశవరావు శ్యామలను సన్మానించారు.